# జెకర్యా 14వ అధ్యాయము

1 ఇదిగో యెహోవా దినము వచ్చుచున్నది, అందు మీ యొద్ద దోచబడిన సొమ్ము పట్టణములోనే
విభాగింపబడును. 2 ఏలయనగా యెరూషలేము మీద యుద్ధము చేయుటకు నేను అన్యజనులనందరిని
సమకూర్చబోవుచున్నాను; పట్టణము పట్టబడును, ఇండ్లు కొల్ల పెట్టబడును, స్త్రీలు చెరుపబడుదురు, పట్టణములో
సగముమంది చెరపట్టబడి పోవుదరు; అయితే శేషించువారు నిర్మూలము కాకుండ పట్టణములో నిలుతురు. 3
అప్పుడు యెహోవా బయలుదేరి తాను యుద్ధకాలమున యుద్ధము చేయురీతిగా ఆ అన్యజనులతో యుద్ధము
చేయును. 4 ఆ దినమున యెరూషలేము ఎదుట తూర్పుతట్టుననున్న ఒలీవ కొండమీద ఆయన పాదములుంచగా
ఒలీవకొండ తూర్పు తట్టునకును పడమటి తట్టునకును నడిమికి విడిపోయి సగముకొండ ఉత్తరపుతట్టునకును
సగము కొండ దక్షిణపుతట్టునకును జరుగును గనుక విశాలమైన లోయ యొకటి యేర్పడును. 5 కొండలమధ్య
కనబడు లోయ ఆజీలువరకు 5 సాగగా మీరు ఆ కొండలోయలోనికి పారిపోవుదురు. యూదారాజైన ఉజ్జియా
దినములలో కలిగిన భూకంపమునకు మీరు భయపడి పారిపోయినట్లు మీరు పారిపోవుదురు, అప్పుడు
నీతోకూడ పరిశుద్ధులందరును వచ్చెదరు. నా దేవుడైన యెహోవా ప్రత్యక్షమగును. 6 యెహోవా, ఆ దినమున
ప్రకాశమానమగునవి సంకుచితములు కాగా వెలుగు లేకపోవును. 7 ఆ దినము ప్రత్యేకమైనదిగా ఉండును,
అది యెహోవాకు తెలియబడిన దినము, పగలుకాదు రాత్రికాదు; అస్తమయ కాలమున వెలుతురు కలుగును. 8
ఆ దినమున జీవజలములు యెరూషలేములోనుండి పారి సగము తూర్పు సముద్రమునకును సగము పడమటి
సముద్రమునకును దిగును. వేసవికాలమందును చలికాలమందును ఆలాగుననే జరుగును. 9 యెహోవా
సర్వలోకమునకు రాజైయుండును, ఆ దినమున యెహోవా ఒక్కడే అనియు, ఆయనకు పేరు ఒక్కటే అనియు
తెలియబడును. 10 యెరూషలేము బెన్యామీను గుమ్మమునుండి మూల గుమ్మమువరకును, అనగా మొదట
' గుమ్మపు కొనవరకును, హనన్యేలు గుమ్మమునుండి రాజు గానుగుల వరకును వ్యాపించును. మరియు
గెబనుండి యెరూషలేము దక్షిణపు తట్టుననున్న రిమ్మోనువరకు దేశమంతయు మైదానముగా ఉండును. 11
పట్టణము ఎత్తుగా కనబడును, జనులు అక్కడ నివసింతురు, శాపము ఇకను కలుగదు, యెరూషలేము
నివాసులు నిర్భయముగా నివసింతురు. 12 మరియు యెహోవా తెగుళ్లు పుట్టించి యెరూషలేము మీద యుద్ధము
చేసిన జనములనందరిని ఈలాగున మొత్తును; వారు నిలిచియున్న పాటుననే వారి దేహములు కుళ్లిపోవును,
వారి కన్నులు కనుతొఱ్ఱలలో ఉండియే కుళ్లిపోవును వారి నాలుకలు నోళ్లలో ఉండియే కుళ్లిపోవును. 13 ఆ
దినమున యెహోవా వారిలో గొప్ప కల్లోలము పుట్టింపగా వారందరు ఒకరి కొకరు విరోధులై ఒకరిమీదనొకరు
పడుదురు. 14 యూదావారు యెరూషలేము నొద్ద యుద్ధము చేయుదురు, బంగారును వెండియు వస్త్రములును
చుట్టునున్న అన్యజనులందరి ఆస్తియంతయు విస్తారముగా 8 కూర్చబడును. 15 ఆలాగుననే గుఱ్ఱములమీదను
కంచరగాడిదల మీదను ఒంటెలమీదను గార్దభములమీదను దండుపాళెములో ఉన్న పశువులన్నిటి మీదను
తెగుళ్లుపడును. 16 మరియు యెరూషలేము మీదికి వచ్చిన అన్యజనులలో శేషించినవారందరును సైన్యములకు
అధిపతియగు యెహోవాయను రాజునకు మ్రొక్కుటకును పర్ణశాల పండుక ఆచరించుటకును ఏటేట వత్తురు. 17
లోకమందుండు కుటుంబములలో సైన్యములకు అధిపతియగు యెహోవాయను రాజునకు మ్రొక్కుటకై

యెరూషలేమునకు రాని వారందరిమీద వర్షము కురువకుండును. 18 ఐగుప్తీయుల కుటుంబపువారు
బయలుదేరకయు రాకయు ఉండిన యెడల వారికి వర్షము లేకపోవును, పర్ణశాల పండుగ ఆచరించుటకై
రాని అన్యజనులకు తాను నియమించిన తెగులుతో యెహోవా వారిని మొత్తును. 19 ఐగుప్తీయులకును,
పర్ణశాల పండుగ ఆచరించుటకు రాని అన్యజనులకందరికిని రాగల శిక్ష యిదే. 20 ఆ దినమున గుఱ్ఱముల
యొక్క కళ్లెములమీద – యెహోవాకు ప్రతిష్ఠితము అను మాట వ్రాయబడును; యెహోవా మందిరములోనున్న
పాత్రలు బలిపీఠము ఎదుటనున్న పళ్లెములవలె ప్రతిష్ఠితములుగా ఎంచబడును. 21 యెరూషలేమునందును
యూదాదేశమందును ఉన్న పాత్రలన్నియు సైన్యములకు అధిపతియగు యెహోవాకు ప్రతిష్ఠితములగును;
బలిపశువులను వధించువారందరును వాటిలో కావలసినవాటిని తీసికొని వాటిలో వండుకొందురు. ఆ
దినము కనానీయుడు ఇకను సైన్యములకు అధిపతియగు యెహోవా మందిరములో ఉండడు.